ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.4। కనిష్ఠం 16.2
కామారెడ్డి జిల్లా వార్తలు
5
ఆదివారం 7 జనవరి 2024

నేడు కామారెడ్డి, బాన్సువాడలో
ముత్యాల ముగ్గుల పోటీలు

కామారెడ్డి టౌన్, జనవరి 6: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' వారి ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్, బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఉదయం 9గంటలకు ఈ పోటీలు ప్రారంభం అవుతాయి. ఈ ముగ్గుల పోటీల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని బహుమతులు గెలుచుకోవచ్చు. మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతిరూ.4వేలు, మూడో బహుమతి రూ.3వేలు గెలుపొందవచ్చు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొనే వారికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తాం. ముగ్గులు వేయడం పూర్తయ్యాక న్యాయ నిర్ణేతలు విజేతలను ప్రకటిస్తారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే ముగ్గుల పోటీకి శ్రీవారి ఎకో టౌన్‌షిప్, రాధిక కన్‌స్ట్రక్షన్, రాధిక మెస్, బాన్సువాడలో నిర్వహించే ముగ్గుల పోటీకి అమృతాధిత్య చిట్‌ఫండ్, జాగృతి హాస్పిటల్స్, వెంకటేశ్వర హాస్పిటల్స్ సహకారం అందించారు.



రైతు బంధుకు ఎదురు చూపులు..!

కామారెడ్డి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతుబంధు సాయం కోసం జిల్లాలోని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. యాసంగి ప్రారంభమై పనులు జోరందుకున్నా పెట్టుబడి సాయం అందలేదు. ఎరువులు, విత్తనాల కొనుగోళ్ల తో పాటు ఇతర వ్యవసాయ అవసరాలకు ప్రభుత్వం అందించే నిధులు సమయానికి రాక అన్నదాతలు ఆందోళనలు చెందుతున్నారు. సమయానికి పెట్టుబడి డబ్బు చేతికి అందక నిత్యం వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. విడతలు, విస్తీర్ణం వారీగా రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే నిధులు జమకాక, రుణమాఫీపై స్పష్టత లేక బ్యాంకులు కొత్తగా రుణాలు మంజూరు చేయడం లేదు. దీంతో పెట్టుబడికి చేతిలో నగదు లేక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఎకరంలోపు ఉన్న వారికే నగదు జమ

రైతుబంధు పథకంలో భాగంగా గత నెల నుంచి రైతుల ఖాతాల్లో కొత్త ప్రభుత్వం నగదు జమ ప్రక్రియ ప్రారంభించింది. ఈ సీజన్‌లో మాత్రం ప్రతీ రైతు ఖాతాలో ఎకరానికి రూ.5వేల చొప్పున ప్రభుత్వం జమ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 3,15,994 మంది రైతులు రైతుబంధుకు అర్హులుగా వ్యవసాయ, రెవెన్యూ శాఖలు గుర్తించాయి. వీరందరికీ రూ.261.84 కోట్లు ప్రభుత్వం రైతుబంధు కింద రైతులకు అందజేయనుంది. అయితే గత నెల నుంచే రైతుబంధు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విడతల వారీగా నగదు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కేవలం ఎకరంలోపు ఉన్నవారికే రైతుబంధు నగదు జమ చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 46,293 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.10 కోట్లు మాత్రమే నగదు జమ చేసినట్లు తెలిసింది.

విడతల వారీగా నగదు జమ

రైతుబంధు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఎకరాన రూ.5వేల చొప్పున నిధులను విడతల వారీగా రైతుల ఖాతాలో జమ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 3లక్షల 15వేల 994 మంది రైతుబంధుకు అర్హులుగా గుర్తించారు. ఇందులో మొదటి విడతగా ఒక ఎకరం ఉన్నవారికి పెట్టుబడి నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎకరం వరకు వ్యవసాయ భూమి ఉన్న రైతులు 1.12లక్షల మంది ఉన్నారు. వీరి ఖాతాలో రూ.5 వేలు పెట్టుబడి సాయం జమకానున్నాయి. 5 ఎకరాలలోపు ఉన్న రైతులు 1.34 లక్షల మంది ఉన్నారు. వీరికి రెండో విడత కింద నిధులను ప్రభుత్వం ఖాతాలో జమ చేయనుంది. 5 ఎకరాలపైన రైతులకు మూడో విడతలో రైతుబంధు నిధులు జమ కానున్నాయి. ఇలా దశల వారీగా రైతులందరికీ పెట్టుబడి సాయాన్ని జమ చేయనున్నారు.

- ప్రారంభమైన యాసంగి సాగు
- అందరికీ అందని రైతుబంధు
- ఇప్పటి వరకు 46,293 మంది ఖాతాల్లో సొమ్ము జమ
- ప్రస్తుతానికైతే పాత పద్ధతిలోనే రైతుబంధు జమ చేస్తున్న కొత్త ప్రభుత్వం
- ఇప్పటికే జిల్లాలో ఎకరంలోపే ఉన్న రైతులకు రైతుబంధు నగదు జమ
- దశలవారీగా నగదు జమ చేయనున్న ప్రభుత్వం
- జిల్లాలో 3.15 లక్షల మంది లబ్ధిదారులు
- రూ.261.84 కోట్లు అంచనా

వచ్చే సీజన్‌లోనే రైతుబంధు రూ.7500

ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భాగంగా రైతుబంధు పెట్టుబడి సాయాన్ని పెంచుతామని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు పోటా పోటీగా హామీలు ఇచ్చాయి. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎకరాన ఏడాదికి రూ.16 వేలు ఇస్తామని, కాంగ్రెస్ రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చాయి. అయితే ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇచ్చిన హామీ మేరకు ఈ సీజన్ నుంచే రైతులకు ఎకరాన సీజన్‌కు రూ.7500లు రైతుల ఖాతాలో జమ చేస్తారని అంతా భావించారు. అదేవిధంగా ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సైతం డిమాండ్ చేసింది. అయితే ఇప్పటికే రైతులు పంటల సాగులో నిమగ్నమవడం పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో మాత్రం పాత పద్ధతిలోనే రూ.5 వేలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుబంధు పెంపుపై పూర్తి నియమ నిబంధనలు రూపొందించి వచ్చే వానాకాలం సీజన్‌లో వేస్తామని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికార వర్గాలు చెబుతున్నాయి.

అన్నదాతల్లో ఆందోళన

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం సుమారు 46 వేల మంది రైతుల ఖాతాలో మాత్రమే పెట్టుబడి సాయం జమ చేశారు. ఒక గుంట నుంచి ప్రారంభించి కేవలం 30 గుంటలలోపు వ్యవసాయ భూమి ఉన్నవారికి నగదు జమ చేసినట్లు తెలుస్తోంది. రైతుబంధు నిధుల్లో ఇప్పటి వరకు ఎకరం లోపే విస్తీర్ణం ఉన్న రైతుల బ్యాంకు ఖాతాలోనే జమ కావడంతో ఆపై విస్తీర్ణం ఉన్న వారు ఆందోళన చెందుతున్నారు. 5 ఎకరాల కన్న ఎక్కువ విస్తీర్ణం కలిగిన జిల్లాలోని అన్నదాతలకు ప్రభుత్వం పెట్టుబడి సాయం నిలిపివేస్తుందనే పుకార్లతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కుర్తి సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావ్



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకం-సాంస్కృతికం, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్ద కొడప్‌గల్, జనవరి 6: గతంలో పరిపాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకం-సాంస్కృతికం, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాలోని జుక్కల్, బిచ్కుంద, పెద్ద కొడప్‌గల్‌లో పర్యటించారు. జుక్కల్ పర్యటనకు వచ్చిన మంత్రి ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పిట్లం మండలం కుర్తి గ్రామంలో జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇంకా నెల రోజులైనా కాక ముందే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధి చేయలేదని, తాము ఇప్పుడు ఏమైనా అభివృద్ధి పనులు చేద్దామంటే ఖజానాకు బొక్క పెట్టి వెళ్లారని విమర్శించారు. ఇక తాను గతంలో 10 సంవత్సరాల క్రితం మంత్రిగా ఉన్న సమయంలో జుక్కల్ పర్యటనకు వచ్చానని, ఆనాడు జుక్కల్ ఎలా ఉందో ప్రస్తుతం అలాగే ఉందని తెలిపారు. 9 సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో అనేక హామీలు ఇచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరి ఆ హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రుణమాఫీ, నిరుద్యోగ యువతకు రూ.3 వేలు ఎటు వెళ్లాయని ప్రశ్నించారు. ఇవన్నీ పథకాలు అమలు చేయకపోగా, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని విమర్శించారు. ఈ సందర్భంలో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓటు వేసి గెలిపించారని, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గ్యాస్ కనెక్షన్ లేని పేదలు చాలా మంది ఉన్నారని అటువంటి వారిని గుర్తించి ఈ నెలాఖరులోగా వారందరికీ గ్యాస్ కనెక్షన్‌లు ఇప్పించాలని మంత్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను ఆదేశించారు. అధికారులు కూడా ప్రజలు కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారికి ఇబ్బందులు పెట్టకుండా పనులు చేసి పంపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్, నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 6,77,151 మంది ఓటర్లు

కామారెడ్డి టౌన్, జనవరి 6: జిల్లాలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 6,77,151 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో జనరల్ ఓటర్లు, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు కలిపి కామారెడ్డిలో 2,54,079 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,22,784, మహిళలు 1,31,272 మంది, ఇతరులు 23మంది ఉన్నారు. ఎల్లారెడ్డిలో 2,22,252 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,07,179మంది, మహిళలు 1,15,071, ఇతరులు 2, జుక్కల్‌లో 2,008,20 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 99,042 మంది, మహిళలు 1,01,769 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. కాగా సర్వీస్ ఓటర్లు మొత్తం 556 మంది ఉండగా ఇందులో జుక్కల్‌లో 138, ఎల్లారెడ్డిలో 258, కామారెడ్డిలో 160 మంది ఉన్నారని జిల్లా అధికారులు వివరిస్తున్నారు.

ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువుపెంపు

ఎల్లారెడ్డి, జనవరి 6: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న పదవ తరగతి 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి అలివేలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా రూ.100 మాత్రమే రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదికి పది రోజుల ముందు నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశపరీక్షలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు.



బతుకమ్మకుంటలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ

నియంత పాలన పోయి..
ఇందిరమ్మ పాలన వచ్చింది !

- ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తాం
- కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్/మాచారెడ్డి/భిక్కనూరు/బీబీపేట, జనవరి 6: రాష్ట్రంలో నియంత పాలన పోయి ఇందిరమ్మ పాలన వచ్చిందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం జిల్లాలోని కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూరు, బీబీపేట మండలాల్లో ఆయన పర్యటించారు. కాగా కామారెడ్డి పట్టణంలోని బతుకమ్మ కుంట, ఇందిరనగర్ కాలనీ, బర్కత్‌పూరలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది దొరల ప్రభుత్వం కాదని, ప్రజా ప్రభుత్వమని అన్నారు. అందుకే ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తుల స్వీకరణను చేపడుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత పాలకుల మాదిరి పార్టీలోకి వస్తేనే ఇళ్లు, పెన్షన్ ఇస్తామని దరిద్రపు ఆలోచనలు మాకు లేవని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉంటుందని అన్నారు. తొమ్మిదేళ్లలో ఒకరికి కూడా రేషన్‌కార్డు ఇవ్వని ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదాని అన్నారు. పేదలకు పంచిన భూములను గత ప్రభుత్వం లాక్కుందని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని లేదంటే నిరంతర ప్రక్రియగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 9వ వార్డు కౌన్సిలర్

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు కౌన్సిలరు సుగుణ శనివారం మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో షబ్బీర్ అలీ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలరు వంశి, శివకృష్ణమూర్తి, నాయకులు గోనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయ సాధనకు కృషిచేయాలి

డిచ్‌పల్లి, జనవరి6: వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలని టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌రాథోడ్ అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతీ క్రీడాకారుడు ఓటమిని గెలుపుగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. శనివారం ఏబీవీపీ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి పురష్కరించుకొని నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడకారులను ఆయన పరిచయం చేసుకొని మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాశ్ చంద్రబోస్‌లను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకుండలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు సాయికుమార్, అమృత్‌చారి, ప్రమోద్, సింహాద్రి, నర్సింహ, పాల్గొన్నారు.

'ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటా కల్పించాలి'

డిచ్‌పల్లి, జనవరి6: ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటాను పెంచాలని ఛత్రపతి పూలే జాగృతి వ్యవస్థాక సభ్యుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2023 సంవత్సరంలో మహిళా చట్ట సభల్లో ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటా పెంపు చేయకపోవడంతో చాలామంది ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. మెజార్టీ మహిళలు చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం కోల్పోతున్నారని మహిళా సాధికరతకు బీజేపీ ప్రభుత్వాన్ని చట్ట సభల్లో మహిళా బిల్లు పెంపుచేయాలని డిమాండ్‌చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, దినేశ్, సుమలత, సంతోషిని, లావణ్య, గీత,జ్యోతి. పాల్గొన్నారు.

అండర్-20 బాలబాలికల జట్టుకు శిక్షణ శిబిరం

మెండోర, జనవరి6: మండలంలో బుస్సాపూర్ గ్రామంలో అండర్-20 బాలబాలికల కబడ్డీ జట్టుకు శిక్షణ శిబిరాన్ని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 9వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందని, సిద్దిపేట్ జిల్లా గజ్వేల్‌లో ఈనెల 11నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపిడి సుజాత, గంగారెడ్డి, ఎంపీటీసీ నడ్పన్న, జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారులు గంగాధర్, ఏలేటి శ్రీనివాస్, మార ముత్యంరెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్ పాల్గొన్నారు.

జిల్లా కారాగారాన్ని సందర్శించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బృందం

నిజామాబాద్ లీగల్, జనవరి6: జిల్లాలోని కారాగారాన్ని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బృందం శనివారం సందరించింది. జైలులో ఉన్న ఖైదీలను ద్దేశించి చీఫ్ లీగల్ ఎయిడ్ రాజ్‌కుమార్ సుబేదార్ మాట్లాడుతూ కారాగారంలో ఉన్న ఖైదీలు ముందుకొని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ యొక్క సేవలను వినియోగించుకోవడానికి దరఖాస్తులను ఇవ్వాలని కోరారు. అలాగే ఖైదీలకు ఎటువంటి సమస్య వచ్చినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఖైదీలకు ఇచ్చిన విజ్ఞప్తి పత్రాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉదయ్‌కృష్ణ, అసిస్టెంట్ కౌన్సిల్ శుభం, ప్రమోద్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు తడపాకల్ విద్యార్థుల ఎంపిక

ఏర్గట్ల, జనవరి6: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమ్రిన్, సౌమ్యకు చింతోజు బ్రహ్మయ్య బాల ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. 2022- 2023 సంవత్సరానికి గాను సమ్రిన్ రాసిన ముద్ద బంతి పుస్తకానికి, సౌమ్య రాసిన బంగారు బాల్యం పుస్తకాలకు ఈ పురస్కారాలు లభించాయని, వీరికి నగదు పురస్కారంతో పాటు, ప్రశంస పత్రాలు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమన్యం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మారం గురుకుల విద్యార్థిని ఎంపిక

డిచ్‌పల్లి, జనవరి 6: డిసెంబరు 21 నుంచి 23 వరకు నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ అండర్-17 పోటీల్లో ధర్మారం గురుకుల పాఠశాల విద్యార్థిని దీప, జిల్లా జట్టు తరుపున పాల్గొని బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. బంగారు పతకం సాధించిన దీప, ఈ నెల 10నుంచి 15వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని పిక్కనిర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు దీప ఎంపికైందని హెచ్‌ఎం సంగీత, ఫిజికల్ డైరెక్టర్ నీరజ, పీఈటీ జ్యోత్స్న లుతెలిపారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.

కాంగ్రెస్‌లో చేరిన మెంట్రాజ్‌పల్లి ఎంపీటీసీ

డిచ్‌పల్లి, జనవరి 6: మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామ బీజేపీ ఎంపీటీసీ సుధీర్ శనివారం ఆ పార్టీ కి రాజీనామా చేసి రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్.భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో అన్ని పార్టీల కు సంబంధించిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని బీఆర్ఎస్ నిర్బంద కంబంద హస్తల నుంచి బయటపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి ఎంపీటీసీ నర్సయ్య కాంగ్రెస్ ప్రతినిధులు షాదుల్ల, కంచెట్టి గంగాధర్, పాల్గొన్నారు.

బాలికలకు రంగోత్సవ్ బహుమతుల పంపిణీ

మోర్తాడ్, జనవరి6: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో శనివారం రంగోత్సవ్ బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ బాలికలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు సంధ్యరాణి, శ్రావణి, మౌనిక, రాము, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మెండోర, జనవరి6: మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2024సంవత్సర పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఎంపీపీ బురుకల సుకన్య కమలాకర్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నూతన క్యాలెండర్‌ను పీఆర్‌టీయూ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్, నవీన్, మనోహర్, శ్రీనివాస్, నర్సింలు, నర్సయ్య, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

వర్ని, జనవరి6: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం వర్నిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై కళా బృందంచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే మేనేజర్ స్రవంతి, వార్డ్ ఎన్‌జీవో కోఆర్డినేటర్ ధర్మేందర్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

హంతకుల కోసం గాలింపు

నిజామాబాద్ రూరల్, జనవరి6: రూరల్ మండలం మల్కాపూర్ తండా సమీపంలో గండి అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి హత్యకు గురైన వ్యక్తి వివరాలు గుర్తించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన గరుధాకర్ సయాజీ (30) గుర్తించారు. గరుధాకర్ లేబర్ పనులు చేసుకుని జీవిస్తున్నాడని, స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు మల్లారం గండి ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. బీరు బాటిళ్లు, మద్యం బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకుని మల్లారం గండిలో దావత్ చేసుకున్నారు. తర్వాత జరిగిన ఘర్షణలో గరుధాకర్ సయాజీ గొంతుకోసి హత్యచేసినట్లు నిర్ధారణకు వచ్చారు. గరుధాకర్ సయాజీని హత్యచేసిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనాస్థలిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. బాటిళ్లపై వేలిముద్రలు, తదితర సాక్ష్యాలు సేకరించారు. హంతకుల కోసం ప్రత్యేక టీంను ఏర్పాటుచేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలను పరామర్శించిన సునీల్‌కుమార్

మోర్తాడ్, జనవరి6: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బబ్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నాయకుడు ముత్యల సునీల్‌కుమార్ ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని అడిగితెలుసుకున్నారు. ఆయనవెంట మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపి, తదితరులున్నారు.

ఆరోపణలు అవాస్తవం

- ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ మహేందర్ వెల్లడి

డిచ్‌పల్లి, జనవరి6: కొందరు తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ఖిల్లా రామాలయ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎలాంటి అవినీతి చేయలేదన్నారు. తాను అవినీతి చేసి ఉంటే దేనికైనా సిద్ధమని, విచారణకు సిద్ధమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి వేముల దీప్తి

ప్రణాళికతో చదివి ఉన్నతస్థానంలో నిలవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి6: విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆర్మూర్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి అన్నారు. శనివారం ఆర్మూర్ మండలంలోని చేపూర్‌లో ఏర్గట్ల రాజుబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్‌జడ్జి దీప్తి వేముల మాట్లాడుతూ విద్యార్థిదశ ప్రతీఒక్కరికి జీవితంలో గుర్తుండిపోయేదన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదవాలని, లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి సాధనకు కృషిచేస్తే విజయం సొంతమవుతుందని అన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు డ్రైవింగ్ చేయవద్దని, డ్రాగ్స్, మాదక ద్రవ్యలకు అలవాటుపడవద్దని, చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూర్ సాయన్న, ట్రస్ట్ ఛైర్మన్ ఏర్గట్ల పోశన్న, వినోద్‌కుమార్, సవ్యశ్రీ, పాఠశాల హెచ్‌ఎం చేతనకుమారి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, మీనుగు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు ప్రతీఒక్కరికి అందించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జనవరి6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీఒక్కరికి అందేలా చూడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీని ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాటా ఎంట్రీలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులో ఏమైనా తప్పులు ఉంటే వాటిని అధికారులు సరిచేసి డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి రావడంతో అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదిన్నర సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన గతపాలకు రాష్ట్ర ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చిందని, ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అర్హులైన ప్రతీఒక్కరికి ఆరు గ్యారంటీలను అందాస్తామన్నారు. జనవరి చివరి వారం నుండి విద్యాశాఖపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల ద్వారా రైతులు ఎరువులు కొనుగోలు చేయాలని, రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో సహకార సంఘాల్లో పాలకవర్గానికి కావలసిన వారికే ఎరువులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం అలా జరిగిందని తమ దృష్టికి వస్తే సహకార సంఘం కార్యదర్శితోపాటు అధ్యక్షులపై సైతం చర్యలుంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బోదన్ పురపాలక సంఘం ఛైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీపీ శ్రీనివాస్, నాయకులు మోహన్ రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, నారాయణ, ఫర్హాన్, లింగం, కామప్ప, రాంగోపాల్‌రెడ్డి, విజయ్ కుమార్, స్థానిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

అధికారులు పనితీరు మార్చుకోవాలి

నవీపేట: ప్రజలకు మరిన్ని సేవలు అందించేందు కు అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన అనంతరం మండల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లు బాధ్యతారహితంగా పనిచేస్తే సహించేది లేదని పలువురు అధికారులకు హెచ్చరించారు. యంచ డీఫ్లోరైడ్ స్కీమ్‌లో నీటి శుద్ధికరణ వివరాల రిపోర్టులను ఇకపై ప్రతీవారం తనకు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. యాసంగి పంటల సాగుకు సంబంధించి గ్రామాల వారిగా పంటల వివరాలు, సాగువిస్తీర్ణం, ఎరువుల వినియోగం వంటి వివరాలను అందించాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వివరాలు, విద్యార్థులసంఖ్య, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల ప్రగతివంటి వివరాలను అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నవీపేట సొసైటీలో గతంలో అరువుగా ఇచ్చిన లక్షలాది ఎరువుల బకాయిలను ఎందుకు వసూలు చేయలేదని సొసైటీ కార్యదర్శిని ప్రశ్నించారు. ఎరువుల బకాయిలను వసూలు చేయాలని, దీనికి సంబంధించిన రిపోర్ట్‌ను అందజేయాలని అధికారులను ఆదేశించారు. తుంగినిలో చేపట్టిన మరమ్మతుల పనులు నాణ్యత లోపంగా ఉండడంతో ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెరువును కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



జేసీబీతో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

మాచారెడ్డి, జనవరి 6: పాల్వంచ మండలం పరిధిపేట గ్రామంలో చెరువును కబ్జాచేస్తున్న కొందరు నాయకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈ, పోలీసులు చెరువు వద్దకు చేరుకుని రెండు టిప్పర్‌లు, జేసీబీని స్వాధీనం పరుచుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా అక్రమంగా పైఅధికారులను బెదిరిస్తూ చెరువు మధ్యలో కోళ్ల ఫారానికి రోడ్డువేసి చెరువులో నీరు నిల్వకుండా చెరువు అలుగును ధ్వంసం చేశారని తెలిపారు. దీంతో దాదాపు 500ఎకరాల వ్యవసాయ భూమికి నీరు అందకుండా పోయిందని అదే చెరువు నుంచి ప్రతీరోజు 100ట్రిప్పుల వరకు మొరం అక్రమ మైనింగ్ జరుపుతున్నారని ఆరోపించారు. కోళ్ల ఫారం నుంచి వచ్చే దుర్వాసన ఈగల ద్వారా గ్రామప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. గతంలో ఈ కోళ్లఫారాలను తొలగించాలని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశామని అలాగే చెరువు మత్తడిని ధ్వంసం చేసినా, చెరువును అక్రమంగా కబ్జా చేసి రోడ్డు వేసుకున్న కోళ్లఫారం యాజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానం చేస్తు పై అధికారులకు సైతం పంపామని తెలిపారు. కాగా ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా అక్రమంగా చెరువునుంచి మొరంను తరలిస్తున్న జయంత్‌రెడ్డి, బట్టశంకర్‌లపై నీటిపారుదల శాఖ ఏఈ మాలిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న హంపీ పీఠాధిపతి

మోర్తాడ్‌లో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి

మోర్తాడ్, జనవరి 6: మండలంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దివ్యక్షేత్రంలో శనివారం జగద్గురు శంకరచార్య హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి ప్రతిష్ఠాపన చేశారు. మండలకేంద్రంలోని జాతీయరహదారి పక్కన నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం వేకువ జామున యంత్ర ప్రతిష్ఠా, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, గణపతి పూజ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన శాంతి పౌష్టిక హోమములు, బలిహరణ, 18మెట్ల తొలిపూజ నిర్వహించారు. గురువారం నుంచి శనివారం వరకు నిత్యన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో పరిసర గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు భారీ ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో వేదపండితులు చంద్రశేఖర్ శర్మ గురుస్వామి, గంగప్రసాద్ దిక్షిత్, శివకుమార్‌శర్మ, రాజగౌతమ్‌శర్మ, మణిదీప్‌శర్మ, పురోహితుడు ప్రవీచణ్‌చారి పాల్గొన్నారు.

మొరం టిప్పర్లకు జరిమానా

నవీపేట, జనవరి 6: మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని సంబంధిత టిప్పర్ల యజమానులకు రూ.20 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ ధన్‌వాల్ శనివారం తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఒక్కోక్క టిప్పర్‌కు 10వేల రూపాయల చొప్పున రెండు టిప్పర్లకు 20వేల రూపాయల జరిమానా విధించినట్లు చెప్పారు. అక్రమంగా మొరాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గేమింగ్ చట్టాలపై అవగాహన సదస్సు

నిజామాబాద్‌లీగల్, జనవరి6: డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య శనివారం జిల్లా కోర్టులో డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బూసారపు రాజేష్‌గౌడ్ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈక్రమంలో గేమింగ్ చట్టాల గురించి, నియమనిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాసిక్యూటర్లు ఎండీ రహీముద్దీన్, బంటు వసంత్, రాజారెడ్డి, డివిజన్ సీఐలు, ఎస్సైలు, ఎక్సైజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్ టౌన్, జనవరి 6: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.దణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ లోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో బోధించుటకు అతిథి అధ్యాపకులు 55శాతం పీజీ ఉత్తీర్ణత సాధించి నెట్, సెట్, పీహెచ్‌డీ బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. రాత పరీక్ష, మెమోలు ఈనెల 19న నిర్వహిస్తామని, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా హిందీ దీవాస్

ముప్కాల్, జనవరి6: హిందీ భాష దినోత్సవాన్ని ముప్కాల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. పిల్లలచే తయారు చేయబడిన హిందీ భాషకు సంబంధించిన కథలు, పద్యాలు సంబంధించిన పుస్తకాన్ని ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఆవిష్కరించారు. పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయులు అజ్మత్, కవిత పాఠశాల హెచ్‌ఎం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గంగారాం మాట్లాడుతూ దేశంలో ఎన్నో సాంస్కృతులు, ఆచారాలు, బాషలు ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ఒకే భాష ఉండడంతో ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండోజి నరేందర్, శ్రీనివాస్; రవి, సురేష్, చిన్నయ్య, రవికుమార్, రాజేందర్, నవీన, సీత, కవిత, సునీత, భగవన్ దాస్, ప్రసాద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు, గొర్రెల పెంపకం ద్వారా అదనపు ఆదాయం

● నాబార్డు డీడీఎం ప్రవీణ్

డిచ్‌పల్లి, జనవరి 6: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి గ్రామీణ శిక్షణ సంస్థ డిచ్‌పల్లి శిక్షణ కేంద్రంలో నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కోళ్ల పెంపకం, పశువుల పెంపకం, గొర్రెల పెంపకం ద్వార అదనపు ఆదాయం పొందవచ్చు అని పేర్కొన్నారు. చేతి వృత్తుల ద్వార నాబార్డు ఆదాయం సమాకుర్చేందుకు సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ సిబ్బంది భాగ్యలక్ష్మీ , రంజిత్, నవీన్, నర్మద, పారిదా, బ్యూటీ పార్లర్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సాయి పారాయణం

ముప్కాల్, జనవరి6: ముప్కాల్ మండలంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద శివసాయి మందిరంలో సప్తహ పారాయణం కొనసాగుతోంది. అవదుతనంద సరస్వతిస్వామి దివ్యశీస్సులతో ప్రారంభమైన పారాయణం 108జంటలతో కొనసాగుతుంది. ఉదయం, సాయంత్రం సాయిభజనలు, కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు!

● కనిపించని సూచిక బోర్డులు ● పట్టించుకోని అధికారులు

కమ్మర్‌పల్లి, జనవరి6: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దు మండలమైన కమ్మర్‌పల్లికి అటు మోర్తాడ్ మండలం ఇటు జగిత్యాల జిల్లా సరిహద్దు గండిహనుమాన్ వరకు కేవలం 6కిలోమీటర్ల దూరం మాత్రమే జాతీయ రహదారి ఉంటుంది. స్థానిక పోలీస్టేషన్ వద్ద ఈ జాతీయ రహదారికి 90డిగ్రీల మలుపు ఉంటుంది. ఈ మలుపువద్దే తరుచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నా పటించుకొనేవారు కరువయ్యారు. ఈ మలుపు రోడ్డు కిరువైపులా చెట్లు ఏపుగా పెరిగి ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు దారితీస్తోంది. కాగా జాతీయ రహదారికి ఇరువైపులా ఇతర గ్రామాలకు వెళ్లే రహదారులు ఉన్నా వాటివద్ద కనీస సూచిక బోర్డులు లేక ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులతోపాటు ప్రమాదాలకు లోనవుతున్నారు. మండల కేంద్రం నుంచి భీమ్‌గల్ వైపు వెల్లే రహదారిపై సైతం ప్రమాదకర మలుపులు ఉన్నా సూచికబోర్డులు లేక తరుచూ ప్రమాదాలు జరుగుతాయి. జాతీయ రహదారికిరువైపుల ఎత్తుగా పెరిగిన చెట్లను పూర్తి స్థాయిలో తొలగిస్తే తప్ప ప్రమాదాలు అదుపు చేయడం కష్టమని అని స్థానికులు వాహనదారులు అంటున్నారు. ఈ రహదారిపై పలుమార్లు ప్రమాదాలు సంభవించి కొందరు మరణించగా మరి కొందరు తీవ్ర గాయాలతో బయటపడారు. కాగా తరుచు ఇక చిన్నచితక ప్రమాదాలలో గాయాలతో బైడపడిన వారి సంఖ్య వందల్లో ఉంటుదని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారికి పక్కనుండే ఉన్నా తిమ్మాపూర్, నాగాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద సూచిక బోర్డు లేక పోడడంతో ఆయా గ్రామల నుంచి జాతీయ రహదారి పైకి వచ్చే వాహనాలు స్పీడ్‌గా మేయిన్‌రోడ్డు పైకి రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాలనీవాసులు రోడ్డు దాటుతూ ప్రమాదాలుకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవిస్తున్న ప్రమాద మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లపై భాగాలను తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.



కమ్మర్‌పల్లి పోలీస్టేషన్‌వద్ద ప్రమాద మలుపు



మలుపు వద్ద కనిపించని సూచిక బోర్డు

ముగిసిన ప్రజాపాలన కార్యక్రమం

- గత నెల 28న ప్రారంభమై ఈనెల 6తో ముగింపు
- ఇప్పటి వరకు 3,08,166 దరఖాస్తులు
- 18 వరకు ఆన్‌లైన్‌లో నమోదు

కామారెడ్డి టౌన్, జనవరి 6: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణను గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు నిర్వహించారు. శనివారం మొత్తం 3,08,166 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పోర్టల్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్‌లను నియమించి శిక్షణ ఇచ్చారు. ఇక ఆన్‌లైన్‌లో ఆయా దరఖాస్తులకు సంబంధించిన పనిలో అధికారులు నిమగ్నంకానున్నారు. అయితే ప్రభుత్వం స్వీకరించే దరఖాస్తులతో పాటు రేషన్‌కార్డుతో పాటు ఇతర అవసరాల నిమిత్తం ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు చేసిన దరఖాస్తులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో మొత్తం 3,08,166 దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఒకే దరఖాస్తును ప్రవేశపెట్టగా అధికారులు జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డుల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా మండల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలోని నిమగ్నమయ్యారు. ఈ దరఖాస్తులను ప్రభుత్వమే ఉచితంగా అందజేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,08,166 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఐదు గ్యారెంటీలకు 2,94,799 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర వాటి కోసం 1,33,67 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ దరఖాస్తుల్లోని వివరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో ఎంట్రీ చేయనున్నారు. ఇందుకోసం 25 మండలాల్లోని మాస్టర్ ట్రైనర్‌లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారు జిల్లాలోని ఆయా డాటా ఎంట్రీ ఆపరేటర్‌లకు శిక్షణ ఇవ్వగా వారు శనివారం నుంచి దరఖాస్తుదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. ఈ నెల 18 నాటికి డేటా ఎంట్రీ పూర్తి చేయనున్నారు.

నసురుల్లాబాద్‌లో..

నసురుల్లాబాద్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాల్లో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం నసురుల్లాబాద్ మండలంలోని లింగంపల్లి తండా, బసవాయిపల్లి గ్రామాల్లో ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో..

బీర్కూర్: ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఏ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అభయ హస్తం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు తమకు ఏఏ పథకాలు కావాలో నిర్ణయించుకుని దరఖాస్తు చేసుకుంటే వారికి ఆ పథకాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి, విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని నాలుగు గ్రామాలలో అధికారులు ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని చీనూర్, బంజార తండా, మెల్లకుంట తండా, పల్లె బోగడ తండా గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలను నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అన్ని గ్రామాల్లో మొదట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, సర్పంచ్‌లు సౌందర్య, మాలోత్ అరుణ, కేశిలి బాయి, అంగోత్ బద్దిబయా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తులు కంప్యూటరీకరణ

ప్రజా పాలన ద్వారా మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన అభయహస్తం దరఖాస్తులను శనివారం నుంచి కంప్యూటీకరణ జరుపుతున్నట్లు ఎంపీడీవో రఘు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేయడానికి మండల కేంద్రంలో 10 కౌంటర్లను ఏర్పాటు చేసే కంప్యూటరీకరణ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శుల సహకారంతో, కంప్యూటర్ ఆపరేటర్లు దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి మండలంలో 6,938 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. శనివారం చివరి రోజు మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం జరిగిందని, ఈ గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పూర్తి వివరాలు ఇంకా రావాల్సి ఉందని ఆయన తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బూర్గుల్‌లో..

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): మండలంలోని బూర్గుల్ గ్రామంలో శనివారం ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అఫ్జల్, ఉప సర్పంచ్ రాములు, పార్టీ అధ్యక్షుడు చాకలి సాయిలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జల జీవన్, మనీష్‌రెడ్డి, భూమయ్య, శివాజీ తదితరులున్నారు.


నసురుల్లాబాద్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం


రైతునగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి


బంజార తండాలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ


పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న హిందూ సంఘాలు

'మతపరమైన బోధనలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

బాన్సువాడ టౌన్, జనవరి 6: పట్టణంలోని స్పార్క్ మైండ్ పాఠశాలలో ఉపాధ్యాయులు, పిల్లలకు మతపరమైన బోధనలు చేస్తున్నారని, హిందూ దేవుళ్ల గురించి విద్యార్థులకు తప్పుగా చెబుతున్నారని, ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు, ఏబీవీపీ, హిందూ వాహిని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాల గేట్ ముందు హిందూ సంఘాల నాయకులు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతపరమైన బోధనలు చేస్తున్న పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడుగుట్ల శ్రీనివాస్, సాయికిరణ్, హన్మాండ్లు, శంకర్‌గౌడ్, అశ్విన్, తల్లిదండ్రులు తదితరులున్నారు.

నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా లక్ష్మణ్

నాగిరెడ్డిపేట, జనవరి 6: నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా బి.లక్ష్మణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బిచ్కుందలో తహసీల్దార్‌గా పని చేసిన లక్ష్మణ్‌ను నాగిరెడ్డిపేటకు బదిలీ చేయగా ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. నాగిరెడ్డిపేటలో ఇది వరకు తహసీల్దార్‌గా పని చేసిన మహేందర్‌కుమార్ ఎల్లారెడ్డికి బదిలీ అయి వెళ్లారు.


అనితా సింగ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

కాంగ్రెస్‌లోకి జుక్కల్ నియోజకవర్గ జాగృతి కన్వీనర్

పెద్ద కొడప్‌గల్, జనవరి 6: జుక్కల్ నియోజకవర్గ జాగృతి కన్వీనర్ అనితా సింగ్ శనివారం జుక్కల్ పర్యటనకు వచ్చిన మంత్రి జూపల్లి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న అనితాసింగ్‌కు మంత్రి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనితా సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రభుత్వం పథకాలకు ఆకర్షితురాలినై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణాన్ని ఓర్వలేకపోతున్న ప్రతిపక్షాలు

- జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి

కామారెడ్డి టౌన్, జనవరి 6: మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణాలు కల్పిస్తే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి అన్నారు. శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు మింగుడుపడడం లేదని అన్నారు. 20 రోజులు కాకుండానే ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆటో, ఆర్టీసీ యూనియన్లను ధర్నాలు చేయాలని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం 5 లక్షల ఇన్సూరెన్సు, సంవత్సరానికి రూ.12వేలు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు.


సెలక్షన్ ట్రయిల్స్‌కు ఎంపికైన సింధూజ

ఏసియా కప్ సెలక్షన్ ట్రయిల్స్‌కు ఎంపికైన సింధూజ

దోమకొండ, జనవరి 6: పారిస్ ఒలపింక్స్, వరల్డ్ కప్, ఏసియా కప్ సెలక్షన్ ట్రయిల్స్‌కు దోమకొండకు చెందిన క్రీడాకారిణి కదిరే సింధూజ ఎంపికైనట్లు కోచ్ ప్రతాప్‌దాస్ శనివారం తెలిపారు. ఈ నెల 10 నుంచి 17 వరకు కోల్‌కత్తాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

లింగంపేట, జనవరి 6: లింగంపేట మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందిన గాండ్ల అంజనేయులు(40) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. తనకున్న రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో రూ. 5 లక్షల వరకు అప్పు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాల్లో తెలియక మనస్థాపానికి గురై శనివారం తెల్లవారు జామున ఇంటి ముందు ఉన్న పశువుల కొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కామారెడ్డి టౌన్, జనవరి 6: ప్లాస్టిక్ రహిత సమాజంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. శనివారం లైఫ్ స్టైల్ ఫర్ ఇనోవెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని తెలిపారు. విద్యార్థి దశ నుంచి ప్లాస్టిక్‌కు బదులు స్టీల్ వస్తువులు వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం దెబ్బ తింటుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడం కోసం విద్యార్థులు మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షణ చేస్తేనే భావితరాలకు ప్రాణ వాయు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, సిద్ధిరాంరెడ్డి, విద్యాసాగర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన విద్యుత్‌శాఖ అధికారులు


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఎల్లారెడ్డి, జనవరి 6: ఎల్లారెడ్డి మండలంలోని సోమిర్యాగడ్ తండాలో విద్యుత్ సమస్యతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండావాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే జిల్లా విద్యుత్‌శాఖ అధికారులకు సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో డీఈ, ఏఈల బృందం స్పందించి గ్రామంలో విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో వేలాడుతున్న వైర్లను గ్రామానికి కావాల్సిన విద్యుత్ స్తంభాలను తొందరగా ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా గత పాలకుల హయాంలో ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని ఎమ్మెల్యే నెల రోజుల లోపు సమస్యను పరిష్కరించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లచ్చానాయక్, ఎంపీటీసీ లక్ష్మీ, నాయకులు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ గడికోటలో సంస్థానాల సేవా సదస్సు

దోమకొండ, జనవరి 6: మండల కేంద్రంలోని దోమకొండ గడికోటలో శనివారం తెలంగాణ సంస్థానాల వారి సేవా సదస్సు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమంలో దోమకొండలో గత 5 నెలలుగా కూచిపూడి శిక్షణ పొందుతున్న చిన్నారులు శిక్షకురాలు హిమబిందు ఆధ్వర్యంలో నృత్యం చేశారు. రాష్ట్ర స్థాయి తెలుగు సాహితీ అభ్యున్నతికి సేవలు అందించిన, అందిస్తున్న పండితులు హాజరయ్యారు. తెలంగాణలోని 14 సంస్థానాల పండితులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కామినేని శోభన, అనిల్ కుమార్, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, కోట మేనేజర్ బాబ్జి, గణేష్, మనోజ్, మేఘన, ఉజ్వల, వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కవులు, పండితులు పాల్గొన్నారు.


గడికోటలో సంస్థానాల సేవా సదస్సులో మాట్లాడుతున్న పండితులు

ఘనంగా సంతోషిమాతా ఆలయ వార్షికోత్సవం


సంతోషిమాతా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడ టౌన్, జనవరి 6: పట్టణంలోని సంతోషిమాతా ఆలయ 8వ వార్షికోత్సవాన్ని శనివారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యాంసుందర్, పురుషోత్తమ శర్మలు వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి ఉదయంనుంచి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. రాజేశ్, నిఖిల దంపతులు అమ్మవారికి 26 తులాల వెండి శటగోపాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కొత్తకొండ భాస్కర్, మల్లికార్జున్, విఠల్‌రెడ్డి, నర్సన్నచారీ, కవిత, సంతోషి, లక్ష్మీ, ఉమ తదితరులు పాల్గొన్నారు.


శబరిమలై వెళుతున్న స్వాములు

శబరిమలైకు బయలుదేరిన స్వాములు

మద్నూర్, జనవరి 6: మండల కేంద్రం నుంచి అయ్యప్ప స్వాములు శబరిమలై యాత్రకు బయలుదేరి వెళ్లారు. గత 41 రోజులుగా అయ్యప్ప దీక్ష చేస్తున్న స్వాములు శనివారం ఇరుముడి కట్టుకుని శబరి మలైకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్, జనవరి 6: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ శివారులో గల బంగారు కొండ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం స్వామి వారికి ప్రత్యేక పర్వదినం సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను భక్తులు కన్నుపండగగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో అఖండ హరి నామ సప్తాహ ప్రారంభం

బీర్కూర్, జనవరి 6 : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో శనివారం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా వార్కారీలు భజనలు కీర్తనలు పాడుతుంటే భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా.. ఒకరి మృతి

మాచారెడ్డి, జనవరి 6: స్కూటీని ఢీకొట్టి తప్పించుకుని వేగంగా వెళ్తుండగా బొలెరో అదుపు తప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం పాల్వంచ మండలంలోని భవానిపేట గ్రామ శివారులో మాచారెడ్డి వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న స్కూటీని పాల్వంచమర్రి సమీపంలో వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం స్కూటీని ఢీకొనడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయాల పాలయ్యారు. దీంతో బొలెరో వాహనదారుడు కంగారుపడి వాహనాన్ని అతివేగంగా నడుపుకుంటూ తప్పించుకోవడానికి భవానిపేట స్టేజి నుంచి ముత్యంపేట వైపు వెళ్లే బీటీ రోడ్డుపై వెళ్తుండగా బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న యూపీ రాష్ట్రానికి చెందిన నేగ్‌పాల్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న ఎల్లారెడ్డి పేట మండలం సముద్ర లింగాపూర్‌కు చెందిన సతీష్‌కు యూపీ రాష్ట్రానికి చెందిన భానుప్రకాష్‌కు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్కూటీపై ఉన్న వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కామారెడ్డిలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- పాల్గొనున్న పలు రాష్ట్రాల క్రీడాకారులు


ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేసిన దృశ్యం

కామారెడ్డి టౌన్, జనవరి 6: కామారెడ్డి కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-17 కబడ్డీ క్రీడాకారులు 12 మంది, వారి వెంట వచ్చే కోచ్, మేనేజర్, హెచ్‌వోడీలు ఇప్పటికే కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. మైదానంలో మొత్తం నాలుగు కబడ్డీ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోటీ నిర్వహణలో 67 మంది రిఫరీలు, 70 మంది టెక్నీషయన్లు, 100 మందికి పైగా ఆర్గనైజర్లు పాలుపంచుకుంటున్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళ్లలో అందించే భోజనాలకు సంబంధించిన మెనూను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాందీపని డిగ్రీ కళాశాలలో నోడల్ ఆఫీసర్లకు సమావేశం ఏర్పాటు చేసి నియమ నిబంధనలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారని డీఈవో రాజు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35 - సలార్
దర్శన్ - ది బ్రిటీష్ సీక్రెట్ ఎజెంట్
శాంతి - ఎనిమల్
ప్రియా 70 - హాయ్ నాన్న

బాన్సువాడ

మహేశ్వరి - సలార్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

